క్లుప్తంగా

చిరస్మరణీయుడు రాయప్రోలు



బాపట్ల అర్బన్: మహా కవి రాయప్రోలు సుబ్బారావు చిరస్మరణీయుడని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు పేర్కొన్నారు. రాయప్రోలు 131వ జయంతి సందర్భంగా సోమవారం మున్సిపల్ హై స్కూల్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రజాతిని జాగృతం చేసిన వారిలో అగ్రగణ్యులు రాయప్రోలు అని కొనియాడారు. బాపట్లను తెలుగు తల్లి పుట్టినిల్లుగా తీర్చిదిద్దారన్నారు. రాయప్రోలు బాపట్ల ప్రాంత వాసి కావడం, బాపట్ల బోర్డు స్కూల్లో విద్యాభ్యాసం చేయడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజశ్రీ, ఫోరమ్ కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, ఉపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, సత్యనారాయణ రావు, మూర్తి, జాన్ సయ్యద్, సాదిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

21న బార్ అసోసియేషన్ ఎన్నికలు

రేపల్లె: బార్ అసోసియేషన్ ఎలక్షన్ ఆఫీసర్‌గా జి.ప్రశాంత్‌కుమార్ సోమవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ నెల 15 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 15, 16 తేదీల్లో నామినేషన్ ప్రక్రియ, 17న పరిశీలన, నామినేషన్‌ల ఉప సంహరణ, 21న ఎలక్షన్, సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

సేంద్రి వ్యవసాయంపై అవగాహన

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరంలో సోమవారం సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు 30 రకాల పీఎండీఎస్‌పై వివరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విత్తనాలకు ఘన జీవామృతం, పొడి బంకమన్ను, ఎలిబూడిద కలిపి విత్తన గుళికలు తయారు చేయించారు. సబ్ డివిజన్ యాంకర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలకరికి ముందు ఇవి భూమిలో చల్లితే వర్షాలకు మొలకలు వచ్చి పచ్చిరొట్ట ఎరువుగా మారుతుందన్నారు. ఈ మొక్కలు 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నితే సారవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఏ పాండు రంగారావు, ఎల్ 2 సురేష్, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



భట్టిప్రోలు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భట్టిప్రోలు ఎస్ఐ వై.సురేష్ వివరాల మేరకు.. జువ్వలపాలెం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేమూరు సీఐ కె. వెంకటేశ్వరరావు వెల్లటూరు వద్ద ఆపి వివరాలు అడిగారు. ఎటువంటి టోకెన్లు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సూది దోమపై అవగాహన



బుర్రిపాలెం(తెనాలి): పంటను నాశనం చేసే సూది దోమపై విశ్వ విద్యాలయం విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. ఒడిశా రాష్ట్రంలోని పర్లాఖిముండిలోని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వ్యవసాయశాఖ విద్యార్థినులు టి.ఆర్తిసాయి, ఎ.హర్షిత సోమవారం తెనాలి రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలోని పంట చేలల్లో పలువురు రైతుల్ని కలిశారు. పంటను నాశనం చేసే కీటకాల్లో సూది దోమ ప్రమాదకరమైందని వివరించారు. అవి హానిచేసే విధానం, నివారణ జాగ్రత్తలు చెప్పారు. కీటక నాశన మందులు సూచించారు.

జాతీయ సమగ్రతా శిబిరంలో సతీష్ ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాల బీకాం విద్యార్థి కె. సతీష్ నరసాపురంలోని వైఎన్ కళాశాలలో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు జరిగిన జాతీయ సమగ్రతా శిబిరంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇటువంటి శిబిరాల్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ముందుకు వెళ్లాలని చెప్పారు. విద్యార్థి సతీష్ మాట్లాడుతూ శిబిరానికి వెళ్లడం ద్వారా తాను సామాజిక బాధ్యతతో పాటు పెద్దల పట్ల వినయ, విధేయతలు, నాయకత్వ లక్షణాల గురించి శిక్షణ పొందానని చెప్పాడు. జె.వి.సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ పథకాలు

'గడప గడపకు' మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



పెదపులివర్రులో సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న మంత్రి నాగార్జున

పెదపులివర్రు(భట్టిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పెదపులివర్రు పంచాయతీ జిలుగువారి పాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన అంతర్గత సీసీ రోడ్లు శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఎదురైనా.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై దుష్టచతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏ ఎన్నికల్లో అయినా సింగిల్‌గా పోటీ చేసే దమ్ము సీఎం జగన్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలా ఉషారాణి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఉప సర్పంచ్ కొర్ల మాధవ, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చిన బుజ్జి, మండల, గ్రామ పార్టీ కన్వీనర్లు మోర్ల శ్రీనివాసరావు, కొనకాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారీబాయి, పార్టీ నాయకులు నీలా రమేష్, దావూరి నాగమల్లేశ్వరరావు, బేతాళ సురేష్, జంపని వెంకటేశ్వరరావు, బుస్సా రాజారత్నం, పులివర్తి వరప్రసాద్, శొంఠి శ్రీనివాసరావు, జంపని అంజయ్య, జిలుగు పండు, బుస్సా రాజ్యలక్ష్మి, జిలుగు ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అర్హుల చెంతకు చేర్చాలి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరి చెంతకు చేర్చాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు నిర్వర్తించాల్సిన విధివిధానాలపై పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో రేపల్లె మండల స్థాయి అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సచివాలయాల సేవలను పర్యవేక్షించటంతో పాటు ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ మార్గదర్శకంగా ఉన్న జగనన్నను, వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను వంచించిన జన్మభూమి కమిటీల మాదిరిగా కాకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా గృహసారథులు, కన్వీనర్‌లు కృషి చేయాలన్నారు. ప్రజలకు అందించే సేవలలో ఏ మాత్రం లోటు కనిపించినా సహించేదిలేదని స్పష్టం చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ గరికపాటి భానుకోటి, మండల ఉపాధ్యక్షుడు పీతా వెంకటేశ్వరరావు, రావు లక్ష్మీ ప్రభాకర్, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరీద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

శక్తివంచన లేకుండా పని చేయాలి

నిజాంపట్నం: రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ముఖ్య అతిథిగా నిజాంపట్నంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులతో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ వారికి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులతో పాటు కన్వీనర్లు, వలంటీర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజల పట్ల దురుసుగా వ్యవహరించినా.. ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేయటంలో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేదిలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథ్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, మండల సచివాలయాల కన్వీనర్ నాజర్‌ఖాన్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లకు ఆహ్లాదం..



చంద్రకళ పార్కు



- నూతన హంగులతో చంద్రకళ పార్క్
- అలసిన పట్టణవాసులు సేదతీరేందుకు.. ఆహ్వానం

బాపట్ల అర్బన్: సాయంత్రం వేళ దేదీప్యమాన కాంతులు. విశాలమైన రహదారి. అందమైన మొక్కల మధ్య వాకింగ్ ట్రాక్. ఆహ్లాద వాతావరణం. తినుబండారాల దుకాణాలు, ఊయలలు, ఆట వస్తువులు. వాటితో ఆడుకుంటూ చిన్నారుల చిరునవ్వులు. ఇవి బాపట్ల పట్టణంలో చంద్రకళ పార్కు నూతన హంగులు. పట్టణ వాసులను సేదతీరేందుకు రారమ్మంటోంది. రోజువారి పనిలో అలసిన బాపట్ల పట్టణ వాసులకు చంద్రకళ పార్కు స్వాగతం పలుకుతోంది. ఈ పార్క్ ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. బాపట్ల జిల్లా కేంద్రంగా మారిన తర్వాత స్మార్ట్ సిటీ హంగులు ఒక్కొక్కటి అద్దుకుంటున్నాయి. ఇందులో భాగంగా బాపట్ల రథం బజారును విస్తరించి సిటీ లుక్ తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో నగర సుందరీకరణకు అధికారులు శ్రమిస్తున్నారు.

నాడు చెత్తాచెదారం..నేడు సుందరవనం

బాపట్ల రైల్వే స్టేషన్ పరిసరాలు గతంలో అధ్వానంగా ఉండేవి. వ్యర్థాలతో ప్రయాణికులకు దుర్వాసన తప్పేది కాదు. బాపట్ల జిల్లా కేంద్రంగా విస్తరించాక ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాన్ని కూల్చేశారు..నూతన భవనం నిర్మించారు. సుందరీకరణకు రూ.80 లక్షలు కేటాయించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు సంకల్పించారు. అందమైన ఆకృతిలో పార్కును ఆధునీకరించారు. పిల్లలకు అవసరమైన ఊయల, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పెద్దలు విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు అమర్చారు. రోడ్డు విస్తరణ చేపట్టి.. విద్యుద్దీపాల కాంతుల్లో సాయంత్రం వేళ చంద్రకళ వెలిగిపోయేలా చేశారు. ఈ సుందరవనానికి వెళితే.. మానసిక ప్రశాంతత కలుగుతోందని ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు మెచ్చుకుంటున్నారు. ఆదివారం, సెలవు దినాల్లోనే కాకుండా ప్రతి రోజూ పార్కుకు పిల్లలను తీసుకొస్తున్నారు. ఉదయం నడకకు, వ్యాయామానికి ఉపయోగకరంగా ఉందని పెద్దలు, యువకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల ప్రాంతానికి ఇలాంటి పార్కు ఏర్పాటు ఇదే ప్రథమం కావడంతో పుర ప్రజలు అభినందిస్తున్నారు.

ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

తెనాలి: ఉపాధి అవకాశాలు కలిగిన స్వల్పకాలిక కోర్సులను ప్రారంభించినట్లు తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలున్న లైన్‌మెన్ డిస్ట్రిబ్యూషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ టెక్నీషియన్ కోర్సులు తెనాలి ఐటీఐలో ఉన్నాయని తెలిపారు. మూడు నెలల కాల పరిధి కలిగిన ఈ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత గల ఒరిజిల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

తెనాలి: క్యాన్సర్ రహిత తెనాలి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం పినపాడులోని కమ్యూనిటీ హాలులో జరిగింది. సోమవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రోత్సాహంతో మున్సిపాలిటీ సహకారంతో శారదా సర్వీస్ సొసైటీ వార్డుల వారీగా మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం 21, 22, 23, 24, 25, 26 వార్డుల పరిధిలోని మహిళలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశరు. ఈ శిబిరంలో అవగాహన, వర్క్‌షాపు, జనరల్ ఎగ్జామినేషన్, రొమ్ము పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పరీక్షలతో క్యాన్సర్‌ను ముందుగానే కనుగొని నివారించే అవకాశం ఉంటుందని శారదా సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద వెల్లడించారు.

పోలీస్ స్టేషన్ ఎదుట సర్పంచ్ నిరసన

తెనాలిరూరల్: తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కొలకలూరుకే చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్త పొన్నెకంటి రమేష్, ప్రీతి మధ్య వాగ్వాదం దాడికి దారి తీసిన విషయం విదితమే. ఇరువురి ఫిర్యాదుల మేరకు రూరల్ పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు. సర్పంచ్ తన కుటుంబ సభ్యులు, బంధువులు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలసి పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మహిళా సర్పంచ్‌పై కేసు పెట్టడమేంటని పోలీసులను ప్రశ్నించారు. తనపై దాడి చేసిన రమేష్‌పై రౌడీషీట్ తెరవాలని డిమాండ్ చేశారు.

బైక్ చోరీ కేసులో ఆరు నెలల జైలు శిక్ష

తెనాలిరూరల్: బైక్ చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పట్టణ మోరిస్‌పేటకు చెందిన ముంత శ్రీనివాసరావు గతేడాది అక్టోబరులో నందులపేట వినాయకుడి గుడికి వెళ్లాడు. గుడి నుంచి బయటకు రాగా అతని ఆక్టివా వాహనం కనబడకపోవడంతో రెండవ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. వన్ టౌన్ పోలీసులు బైక్ దొంగలను అరెస్ట్ చేసి వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఇందులో శ్రీనివాసరావు వాహనం కూడా ఉంది. నిందితుడిని నందుల పేటకు చెందిన కోటిసాయి మంజునాథ్ అలియాస్ మంజుగా గుర్తించారు. దీనిపై అప్పటి టూ టౌన్ సీఐ బి.కోటేశ్వరరావు చార్జిషీటు దాఖలు చేయగా కేసు సోమవారం విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండీ రహంతుల్లా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ వాదించారు.

రేడియో ఆర్టిస్ట్ దివాకర్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం ఆటగాడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం గుండమ్మకథ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు, రేడియో ఆర్టిస్ట్ ఇందుపల్లి దివాకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముద్వా డేవిడ్, పినపాటి చంద్రశేఖర్, చావలి రాజేంద్రప్రసాద్, కొండముది రమేష్, పి.శ్రీకరరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, కుదరవల్లి శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మదేవరకు సత్కారం



తెనాలి: మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యునిగా నియమితులైన బొమ్మదేవర వెంకటేశ్వరరావును తెనాలి పట్టణ, పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సోమవారం సత్కరించింది. సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. బొమ్మదేవర వెంకటేశ్వరరావు సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. నూతనంగా మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యత్వం లభించటంతో ఈ అభినందన సభను ఏర్పాటుచేశారు. సంఘ పాలకవర్గ సభ్యులు, ఎన్జీఓ, పెన్షనర్స్, తెనాలి శాఖ నాయకులు, మాజీ సైనిక సంఘం సభ్యులు బొమ్మదేవరను సత్కరించినవారిలో ఉన్నారు. సంఘ కోశాధికారి నారాయణం కమల్‌కుమార్, ఉపాధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ఆర్ఎస్ శంకరరావు, డీవీ సోమయ్యశాస్త్రి, మొవ్వ సత్యనారాయణ పాల్గొన్నారు.

19న అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

ముఖ్య అతిథిగా ఎంపీ తిరుమావళవన్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శంకరరావు, సురేంద్ర, కిరణ్ తదితరులు

తెనాలిఅర్బన్: అంబేడ్కర్ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, వైఎస్సార్ సీపీ 1వ వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర తెలిపారు. బస్టాండ్ సమీపంలోని సామ్రాట్ హోటల్‌లో సోమవారం సాయంత్రం విగ్రహావిష్కరణ వాల్ పోస్టర్లు, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొల్లిపర గ్రామంలో సాయంత్రం 6 గంటలకు అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా తమిళనాడు వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్ హాజరవుతారని చెప్పారు. అలాగే ఐతా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొల్లిపర వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. తెనాలి నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ రాజకీయాలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దళిత నాయకులు సొపాటి కిరణ్, అక్కిదాసు కిరణ్, డాక్టర్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ బహుజనులలో ఐక్యతను తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో పిల్లి విజయ భాస్కర్, కంచర్ల అమృతరాజు, నక్కా సంసోను, డాక్టర్ కంచర్ల విజయ భాస్కర్, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, ఆరె శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు



ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలిరూరల్: సోషల్ మీడియాలో అసభ్యకర, అశ్లీల పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొలకలూరు గ్రామంలో సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, గ్రామానికే చెందిన పొన్నెకంటి రమేష్‌ల వివాదం నేపథ్యంలో ఇరు వర్గాలు సోషల్ మీడియాలో అభ్యంతరకరంగా పోస్టులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వివాదంపై కేసులు నమోదై .. దర్యాప్తులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో అసభ్యకరంగా పోస్టులు పెడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా కొందరు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటివి ఉపేక్షించేది లేదన్నారు. సర్పంచ్ ప్రీతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి 41 నోటీసులిచ్చినట్లు తెలిపారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం నులిపురుగుల నివారణ కోసం ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తోందని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జి.కీర్తి పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేపడుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ కీర్తి మాట్లాడుతూ చేతుల ద్వారా ఎన్నో క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని, తద్వారా అనారోగ్యం బారిన పడతామని తెలిపారు. మంచి అలవాట్ల ద్వారా రోగాల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చని విద్యార్థులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం ద్వారా నులి పురుగుల్ని నివారించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతి ఆర్నెల్లకోసారి నులి పురుగుల నివారణ మాత్రల్ని పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు కాల్వను పరిశీలించిన డీఎల్‌పీవో



స్థానికులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

పెదనందిపాడు: మురుగు కాల్వ పూడిపోయి, నీరు పారక అవస్థలు పడుతున్నామని గ్రామస్తుడు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం గుంటూరు డీఎల్‌పీవో వి.వి.ఎం. లక్ష్మణరావు పెదనందిపాడులో పర్యటించారు. గుంటూరు పర్చూరు ప్రధాన రహదారిలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మురుగు కాల్వను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదనందిపాడు గ్రామస్తుడు సాంబశివరావులో స్పందనలో అర్జీ ఇచ్చారని, దాన్ని పరిశీలించటానికి వచ్చామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ ఇంజినీర్లతో సర్వే చేయించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఆయన వెంట కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

కొండపాటూరు(కాకుమాను): పోలేరమ్మ తల్లి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొండపాటూరులో పోలేరమ్మ తల్లి తిరునాళ్లనను వచ్చే నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభల్ని నిర్మించుకోవడానికి గానూ తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అధికారుల్ని కోరారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, దేవాలయ చైర్మన్ రామినేని నాగవేణి, గ్రామ సర్పంచ్ యర్రాకుల కామేశ్వరి, ఈఓ సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగి మృతిపై ఫిర్యాదు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం వచ్చిన బిళ్ల బాలరాజు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బత్తు వెంకటసతీష్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీజీహెచ్ క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, జూనియర్ డాక్టర్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల పేదలకు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారని ఆరోపించారు. సంఘటనపై విచారణ జరిపి సీనియర్ వైద్యులు క్యాజువాలిటీలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి శ్రీనివాస్, భీమ్ భా రత్ నేతలు దొడ్డా రాజేంద్రప్రసాద్, ఎస్.కె.బాజీ, ఎర్రగుంట్ల సుజాతారావు, బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నరసింహారావు ఉన్నారు.

ఆర్ఐగా జాన్ బాధ్యతలు

తెనాలిరూరల్: తెనాలి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా యు.జాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్ కె. రవిబాబు, ఇతర ఉన్నతాధికారులను కలిశారు. ఇక్కడ ఆర్ఐగా పని చేస్తున్న షేక్ కరిముల్లా గుంటూరు డీఎస్ఓ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు.